క్లుప్తంగా

మైనార్టీల అభ్యున్నతే ధ్యేయం



నవాబుపేట(పెనుగంచిప్రోలు): ముస్లిం, మైనార్టీల సామాజిక అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి షేక్ జుబేర్, జగ్గయ్యపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఫిరోజ్ ఖాన్ అన్నారు. హర్ దిల్ మే వైఎస్సార్–హమ్ సబ్ జగన్‌కే సాత్ కార్యక్రమంలో భాగంగా నవాబుపేట, జగ్గయ్యపేట మండలంలోని వేదాద్రి, జయంతిపురం గ్రామాల్లో ముస్లిం పెద్దలు, మసీదు ప్రముఖులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా జగనన్న ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. హజ్ యాత్రికులకు ఈసంవత్సరం ప్రభుత్వం చేసిన సేవలు గుర్తుండి పోతాయన్నారు. అనంతరం కరపత్రాలు అందజేశారు.

సమస్యలు తెలుసుకునేందుకే వార్డు పర్యటన



నందిగామ: పట్టణ ప్రజలకు మున్సిపాలిటీ ద్వారా అందుతున్న సేవలను ప్రత్యక్షంగా వివరించడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ప్రతి రోజు వార్డు పర్యటన చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని 19వ వార్డులో మంగళవారం ఆయన పర్యటించారు. ఇందులో భాగంగా వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను, బోరుల్లోని నీటి నాణ్యతను పరిశీలించారు. వార్డు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పలువురు సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): గ్రామంలో గాదె సురేష్ కుమార్తెకు అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సీఎంవో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి కార్యాలయం రూ.3 లక్షల ఎల్‌వోసీని మంజూరు చేశారు. ఎల్‌వోసీ పత్రాలను సోమవారం రాత్రి బాధిత కుటుంబానికి ఉదయభాను అందజేశారు. అదే విధంగా పట్టణంలోని సీతారామాపురం యాదవ బజార్‌కు చెందిన చిన్నారులు సుప్రియ, హరిప్రియలకు మంజూరైన రూ.5.20 లక్షల ఎల్‌వోసీ పత్రాలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువ నాయకుడు సామినేని వెంకట కృష్ణప్రసాద్, నాయకులు సతీష్, వినోద్, నరసింహారావు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యానికి రక్ష



కొణకంచి(పెనుగంచిప్రోలు): యోగాతో ఆరోగ్యాన్ని రక్షించుకోవచ్చని వైద్యాధికారి కె.వాణి అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి రోజు యోగా, ప్రాణాయామం, ధ్యానం చేయటం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. బుధవారం జరిగే కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట సాగుదారుల హక్కుల పత్రంపై అవగాహన

రెడ్డిగూడెం: మండలంలోని ముచ్చనపల్లి రైతు భరోసా కేంద్రంలో పంట సాగుదారుల హక్కుల పత్రంపై కౌలు రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఆర్.సురేష్ మాట్లాడుతూ ఓనర్ రైతు కౌలు రైతు మధ్య గ్రామ రెవెన్యూ అధికారి సమక్షంలో ఒప్పందం చేసుకోవాలన్నారు. తద్వారా ఈ–కార్డ్ పొందవచ్చని తెలిపారు. ఈ–కార్డ్ పొందిన కౌలు రైతుకు పంటపై మాత్రమే హక్కు ఉంటుందని, భూమిపై ఎటువంటి హక్కు ఉండబోదని తెలిపారు. గ్రామంలో ప్రతి ఒక్క కౌలు రైతు కౌలు కార్డు తీసుకోవాలని, దీనికి ఓనర్ రైతులు సహకరించాలని తెలిపారు. ఈకార్డ్ పొందిన వారికి ఈ క్రాప్ పంట నమోదు, పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సాగు భూమిలేని కౌలు చేస్తున్న రైతులకు వైఎస్సార్ రైతు భరోసా వస్తుందని తెలిపారు. సర్పంచులు అట్లూరి శ్రీనివాసరావు, దేవుళ్ల జమలయ్య, మద్దిరెడ్డి జమలారెడ్డి పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేయండి

- సమీక్షా సమావేశాల్లో అధికారులు
- 23 నుంచి అట్టహాసంగా ప్రారంభం



నందిగామలో సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ జయరాం



కంచికచర్లలో మాట్లాడుతున్న తహసీల్దార్ శంకరబాబు

నందిగామ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం ఆదేశించారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై పట్టణ పరిధిలోని సచివాలయ సిబ్బందికి మంగళవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జగనన్న సురక్ష పథకంలో నిర్వహించాల్సిన విధి విధానాలపై పవర్ పాయింట్‌జేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈనెల 23న జగనన్న సురక్ష పథకం ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంపై 23 నుంచి ఈ నెల 30వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి సచివాలయ పరిధిలో నివాసం ఉండే వారి వివరాలు, వారు ఇప్పటి వరకు అందుకుంటున్న ప్రభుత్వ పథకాలు, అర్హత ఉన్నా కూడా ప్రభుత్వ పథకాలు అందుకోలేని వారి వివరాలు సేకరించడంతో పాటు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూసేందుకే ఈ కార్యక్రమం జరగనుందన్నారు. ప్రతి ఒక్కరూ రోజువారి విధులతో పాటు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ పరిధిలోని అన్ని సచివాలయాల్లో పనిచేస్తున్న పలు విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను అందించడమే లక్ష్యం

కంచికచర్ల: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించటమే లక్ష్యంగా జగనన్న సురక్ష పథకానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఎంపీడీఓ కె.బాలశంకరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం జరిగింది. ఈ మేరకు ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఈనెల 23 నుంచి 30వ తేదీ వరకు జగనన్న సురక్ష పథకాన్ని గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమం తొలిదశలో గ్రామ, వార్డు సచివాలయ పరిధిలోని సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులు ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న సురక్ష గురించి వివరిస్తారన్నారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు పొందని వారు, సర్టిఫికెట్ల జారీలో ఇబ్బందులను నిశితంగా పరిశీలిస్తారని చెప్పారు. ఆ వివరాలను నమోదు చేసుకుని రెండో దశ కింద నిర్ణేత తేదీల్లో మండల స్థాయి అధికారులు ఆయా గ్రామాల సచివాలయాలను సందర్శిస్తారన్నారు. అర్హులను గుర్తించి వారిని సచివాలయాలకు ఆహ్వానించి వారికి అవసరమైన సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లను అదే రోజు అందజేస్తామని చెప్పారు.



జగ్గయ్యపేటలో మాట్లాడుతున్న తహసీల్దార్ సూర్యారావు

గ్రామాలకు రెండు బృందాలు...

గ్రామాల్లో అర్హులకు అవసరమైన వాటిని మంజూరు చేసేందుకు మండల స్థాయి అధికారులను రెండు బృందాలను ఏర్పాటు చేశారన్నారు. ఒక బృందంలో ఎంపీడీవో, డెప్యూటీ తహసీల్దార్, ఏపీవో, రెండో బృందంలో తహసీల్దార్, ఈవోపీఆర్డీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ఉంటారన్నారు. మండలంలోని 16 గ్రామాల్లో రెండు బృందాలు పర్యటిస్తాయి. మొదటి టీమ్ వచ్చే నెల 1వ తేదీన మండలంలోని చెవిటికల్లు, 4న గండేపల్లి, 6న గనిఆత్కూరు, 11న గొట్టుముక్కల, 13 కంచికచర్ల–1, 15న కంచికచర్ల–2, 18న కంచికచర్ల–3, 20న కీసరలో సందర్శిస్తారన్నారు. అదేవిధంగా రెండవ టీం సభ్యులు 1న కొత్తపేట, 4న కునికెనపాడు, 6న మోగులూరు, 11న పరిటాల–1, 13న పరిటాల–2, 15న పెండ్యాల–1, 18న పెండ్యాల–2, 20న పేరకలపాడు, 22న వేములపల్లిలో పర్యటించనున్నరని తెలిపారు. సమావేశంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, డీటీ నాగుల్‌మీరా, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై సమీక్షా సమావేశం..

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న జగనన్న సురక్ష పథకంపై మంగళవారం సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సూర్యారావు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల సచివాలయ సిబ్బంది జగనన్న సురక్షపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వారి సచివాలయ పరిధిలోని అన్ని రకాల సంక్షేమ పథకాలను అర్హుల జాబితాను సచివాలయంలో ఉంచాలని తెలిపారు. అంతే కాకుండా పథకాలకు అర్హులను గుర్తించాలని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సాంబశివరావు, ఎంఈవో చిట్టిబాబు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజలకు మరింత ప్రయోజనం చేకూర్చేందుకే'



పెనుగంచిప్రోలులో మాట్లాడుతున్న ఎంపీపీ గాంధీ, పక్కన అధికారులు

పెనుగంచిప్రోలు: ప్రజలకు మరింత ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం జగనన న సురక్ష పథకాన్ని ప్రారంభిస్తోందని ఎంపీపీ మార్కపూడి గాంధీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సురక్ష కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలను ఈ కార్యక్రమం ద్వారా ఉచితంగా అందిస్తామన్నారు. ఎంపీడీఓ ఎస్వీ ప్రసాద్, తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి మాట్లాడుతూ ఈనెల 23 నుంచి 30 వరకు వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ।జగనన్న సురక్షౌ పథకం ముఖ్య ఉద్దేశాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వం నుంచి వారికి ఎటువంటి ధ్రువీకరణపత్రం అవసరమో తెలుసుకోవాలన్నారు. తరువాత సచివాలయాల పరిధిలో క్యాంప్‌లు నిర్వహించి ప్రజలకు ధ్రువపత్రాలు మంజూరు చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఓ కె సిద్ధారెడ్డి, ఈఓపీఆర్‌డీ శ్యామ్, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

పట్టణంలో నూతన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణ వాసులకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. జగ్గయ్యపేట పట్టణంలోని కోదాడ రోడ్డులోని పాత ఎస్‌పీసీ క్వార్టర్స్‌లో నూతన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేశారు. ఒక సీఐతో పాటు ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, 10 మంది కానిస్టేబుళ్లను ఈ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు నియమించనున్నారు. అతి త్వరలో ఈ స్టేషన్‌ను పోలీస్ ఉన్నతాధికారులు ప్రారంభించనున్నారు. పారిశ్రామిక వాడగా రోజు రోజుకు విస్తరిస్తున్న జగ్గయ్యపేట పట్టణంలో గత కొంత కాలంగా ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. పలు ప్రధాన కూడళ్లలో వాహనదారులు తమ వాహనాలు ఒక క్రమంలో కాకుండా ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయడంతో ప్రధాన వీధుల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. దీంతో పట్టణంలో నూతన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుచేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను గత కొంత కాలంగా జిల్లా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తున్నారు. ఈక్రమంలో పేటలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. కోదాడ రోడ్డులో గతంలో విప్ ఉదయభాను కార్యాలయం ఉన్న క్వార్టర్‌లో నూతన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుచేస్తూ అన్ని ఏర్పాట్లు చేయడం పట్ల పట్టణ ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు..

పట్టణంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడంతో పాటు త్వరలో ప్రారంభోత్సవం జరుపుకోనున్న దృష్ట్యా పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు మంగళవారం నుంచి ట్రాఫిక్ నిబంధనలను అమలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ రామచంద్రరావు ఆధ్వర్యంలో 16 గంటల రోల్‌కాల్, అన్ని ట్రాఫిక్ పాయింట్లలో ట్రాఫిక్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు.



జగ్గయ్యపేటలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌తో ఉపాధి కల్పన



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్ మనోహర్

జగ్గయ్యపేటఅర్బన్: స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుతో జగ్గయ్యపేట ప్రాంతంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని 5వ వార్డు ఆర్టీసీ కాలనీలో రూ.70 లక్షల ఎంపీ నిధులతో చేపట్టిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవన నిర్మాణ పనులను మంగళవారం వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్‌తో కలిసి మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అతి త్వరలోనే నైపుణ్య శిక్షణ భవనం పట్టణ వాసులకు అందుబాటులోకి వస్తుందన్నారు. నైపుణ్య శిక్షణతో పాటు కాకానినగర్, డాంగేనగర్, ఆర్టీసీ కాలనీ, దుర్గాపురం, విద్యానగర్ తదితర ప్రాంతాలకు చెందిన డ్వాక్రా సంఘాల సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి కాని, ప్రభుత్వం చేపట్టే పలు రకాలైన శిక్షణా తరగతులను నిర్వహించుకోవడానికి ఈ భవనం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. పట్టణంలో మిగతా ప్రాంతాల్లో ఉన్న మున్సిపల్ స్థలాల్లో ఓపెన్ జిమ్‌లు, మినీ పార్కులు, కమ్యూనిటీ హాల్స్ నిర్మించేందుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని తెలిపారు. ఈ భవనం మంజూరుకు కృషిచేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, ఎంపీ కేశినేని నానిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 4వ వార్డు సచివాలయం కన్వీనర్ చిరంజీవి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు షేక్ ఖాదర్‌బాబు, మున్సిపల్ కౌన్సిలర్ కొలగాని రాము, పెనుగంచిప్రోలు మండల సచివాలయాల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, నాయకులు గంద్రాయి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఈవో – 2లు



ఎంఈవో బాలాజీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

కంచికచర్ల: మండల విద్యాశాఖాధికారి – 2గా బి.బాలాజీ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక మండల వనరుల కేంద్ర కార్యాలయంలో యూటీఎఫ్ సంఘ ప్రధాన కార్యదర్శి కోపూరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సంఘ నాయకులు బాలాజీని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సంఘ జిల్లా ఆడిట్ సభ్యులు పులి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కె.ఫణీంద్రకుమార్, సంఘ నాయకులు మేరుగ రామారావు, కె.పుల్లారావు, మల్లారపు రామారావు పాల్గొన్నారు. నందిగామ నుంచి కంచికచర్ల బదిలీపై వచ్చిన ఎంఈవో బి.బాలాజీని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్షుడు వేముల భిక్షమయ్య ఆధ్వర్యంలో సంఘ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి విక్టర్ నగేష్, జిల్లా ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, బళ్లా రవికుమార్, శేషం గోపాలరావు, షేక్ మౌలాలి, శేషం వెంకట్రావు, నంద్రు సురేష్, మందా సుధాకర్ తదితరులున్నారు.

ఎంఈవో –2గా పాల్ కెనడీ..

వీరులపాడు: వీరులపాడు మండల ఎంఈవో –2గా పాల్ కెనడీ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంఈవోగా పని చేస్తున్న చిట్టిబాబు జగ్గయ్యపేటకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానన్నారు. ఈ ఏడాది 10వ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సత్కరించారు.

తారకనాథ్‌కు నివాళి



నందిగామ: పట్టణంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో కామ్రేడ్ వై.తారకనాథ్ 19వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ముందుగా విజయవాడ వెస్ట్ రీజనల్ కార్యదర్శి జి.రాజశేఖర్ ఆధ్వర్యంలో తారకనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తారక నాథ్ యూనియన్‌కి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ బాలుర వసతి గృహంలో ఆరు సీలింగ్ ఫ్యాన్లు, పలు ఉపకరణాలతో పాటు విద్యార్థులకు భోజన ఏర్పాట్లు చేశారు. ఆయా కార్యక్రమాల్లో నందిగామ మెయిన్ బ్రాంచ్, టౌన్ బ్రాంచ్, చందర్లపాడు మండలం ముప్పాళ్ల ఎస్‌బీఐ సిబ్బంది నరేంద్ర, విజయ్, గౌస్ పీరా తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

తిరువూరు: స్థానిక కోదండరామాలయంలో మంగళవారం ఆషాఢమాస సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారామచంద్రస్వామికి, ఆళ్వార్లకు తిరుమంజనం కార్యక్రమాన్ని అర్చకులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పలువురు భక్తులు స్వామి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త సోమవరపు సత్యనారాయణ పర్యవేక్షించారు.

నేడు కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

మైలవరం: మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ నియోజకవర్గంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు నియోజకవర్గంలోని జి.కొండూరు మండలం వెంకటాపురంలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు మైలవరం మండలం చంద్రగూడెంలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణంతో పాటు సిమెంట్ రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఐదు గంటలకు మొర్సుమల్లిలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. సాయంత్రం 5.30 గంటలకు రెడ్డిగూడెం మండలం కుదప గ్రామంలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

●సీఎం వైఎస్ జగన్‌కు ఆత్మీయ స్వాగతం



విజయవాడలోని ఏ కన్వెన్షన్ హాలులో టెన్త్, ఇంటర్మీడియెట్, ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు రాష్ట్ర స్థాయి అవార్డులను మంగళవారం ప్రదానం చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ శాలువా కప్పి ఆత్మీయ స్వాగతం పలికారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.

విప్లవాత్మక సంస్కరణలతో సీఎం పాలన



బోడవాడలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేసి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

బోడవాడ(వీరులపాడు): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణలతో పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని బోడవాడ గ్రామంలో మంగళవారం ఆయన ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి పథకాల అమలు తేదీల క్యాలెండర్‌ను, బ్రోచర్‌ను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ.. పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు.

అన్ని వర్గాలకు అండగా..

గత ప్రభుత్వాల మాదిరిగా ఏ ఒక్క వర్గానికో కొమ్ముకాయకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్ని వర్గాలకు అండగా నిలిచారని ఎమ్మెల్యే జగన్ మోహనరావు పేర్కొన్నారు. అధికారంలోకి రాగానే ఎన్నికల మేనిఫెస్టోను మాయం చేస్తున్న పాలకులున్న ప్రస్తుత పరిస్థితుల్లో మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్ మాదిరిగా పవిత్ర గ్రంథంగా భావించి మేనిఫెస్టోలోని అన్ని హామీలను అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి డీబీటీ పద్ధతిలో రూ. 2.10 లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన ఏకైక ముఖ్యమంత్రి అని కొనియాడారు. ప్రతిపక్షాలు ఎన్ని ఆరోపణలు చేసినా వాటిని వినే స్థితిలో ప్రజలు లేరని చెప్పారు.

ప్రాధాన్యతాక్రమంలో సమస్యల పరిష్కారం..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తమ దృష్టికి వచ్చిన ప్రతి ఒక్క సమస్యను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రికి ప్రజలంతా అండగా ఉండి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, గ్రామ సర్పంచ్ శీలం సంధ్య, ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, నాయకులు శీలం భాస్కర్‌రెడ్డి, యాదాల దాసు, పలువురు నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభం

తిరువూరు: కేంద్ర ప్రభుత్వ నూతన విద్యావిధానానికి అనుగుణంగా తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి పలు మార్పులతో డిగ్రీ కోర్సులలో విద్యార్థులను చేర్చుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.సుశీలరావు మంగళవారం తెలిపారు. విద్యార్థులు తమకు కావలసిన కోర్సులో చేరడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కోర్సులు సింగిల్ మేజరుగా మారాయని, ప్రతి ప్రోగ్రామ్‌లో ఇప్పటివరకు ఉన్న మూడు మేజరు సబ్జెక్టులకు బదులుగా సింగిల్ మేజరు సబ్జెక్టుగానూ, ఒక మైనర్ సబ్జెక్టును ఎంచుకోవాలని సూచించారు. తమ కళాశాలలో బీఏ డిగ్రీలో హిస్టరీ మేజరు సబ్జెక్టుగా, ఎకనామిక్స్ మైనర్ సబ్జెక్టుగా ఎంచుకోవాలని తెలిపారు. బీకాం డిగ్రీలో కంప్యూటర్ అప్లికేషన్స్ మేజరు సబ్జక్టుగా, ఎకనామిక్స్ మైనర్ సబ్జెక్టుగా, బీఎస్సీలో కంప్యూటర్ సైన్స్ మేజరు సబ్జెక్టుగా, లెక్కలు మైనర్ సబ్జెక్టుగా, బీఎస్సీలో జువాలజీ మేజర్ సబ్జెక్టుగా, బోటనీ మైనర్ సబ్జెక్టుగా ఎంచుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని, వివరాలకు కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

నందిగామలో భారీ వర్షం

నందిగామ: నందిగామ ప్రాంతంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన చల్లగాలులు వీచాయి. దీంతో మంగళవారం సాయంత్రం నుంచి ఒక్కసారిగా వాతావరణం మారింది. కొంతకాలంగా భానుడి ప్రతాపంతో ఇబ్బందులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఒక్కసారిగా వాతావరణం మారి వర్షం కురవడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే సమాచారమివ్వాలి



నందిగామ: గ్రామాల్లో అనుమానాస్పదంగా కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని ఇన్‌స్పెక్టర్ హనీష్ సూచించారు. మండలంలోని కంచల గ్రామంలో మంగళవారం సాయంత్రం ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు గ్రామస్తులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి సోదర భావంతో ఉండాలన్నారు. గ్రామంలో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే అప్రమత్తంగా ఉండడంతో పాటు వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు పండు దొర, సోమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.